క్లుప్తంగా

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


తహసీల్దార్ జె.రాములమ్మ

సీతానగరం: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. తహసీల్దార్‌గా సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో డీటీ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ రామారావు, మండల సహాయ గణాంకాధికారి సతీష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు


కోటవీధి వద్ద నిలిచిపోయిన వాహనాలు

సాలూరు: పట్టణంలోని కోటవీధి జంక్షన్ మలుపు వద్ద తరుచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, పార్శిల్ సర్వీసులు, బ్యాంకు, మార్కెట్‌కు వెళ్లాలంటే ఈ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించాలి. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలతో ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. బొబ్బిలి మండలం పారాది వంతెన మీదుగా భారీ వాహనాలకు అనుమతి లేకపోవడంతో ఈ మార్గం గుండానే లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో కోటవీధి జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జాం అవుతోందని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరిలో జింక్ లోపం


వరి వెదపొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తున్న వరిపొలాల్లో జింక్ లోపం గుర్తించినట్లు ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. గుచ్చిమి, అప్పయ్యపేట, జోగింపేట, అంటిపేట గ్రామాల్లో వరి వెదపొలాలను సోమవారం సందర్శించారు. జోగింపేటలో జింక్ లోపం ఉన్న పొలాలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. జింక్ లోప నివారణకు ఎకరాకు 110 గ్రాముల ఫోలియర్ జింక్ పిచికారీ చేసుకోవాలని, లేదంటే జింక్ చిలామిన్ వాడాలని సూచించారు. కౌలురైతులకు గుర్తింపు పత్రాలు అందజేస్తున్నామన్నారు. రైతులు విధిగా ఈక్రాప్‌లో సాగు వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావుతో పాటు పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారని, వారు కూర్చోడానికి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే కాంప్లెక్స్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు మరుగుదొడ్ల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయని, రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడం లేదని, కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉందని వాపోయారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పోరాటాలే శరణ్యం..

పాలకొండ రూరల్: దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీలకు శతశాతం అందాల్సిన వసతులు అందించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని ఏపీ గిరిజన సంఘ జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు అన్నారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండగూడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని 93 దేశాల్లో 39 కోట్ల ఆదివాసీలు ఉన్నట్లు తెలిపారు. 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించినప్పటి నుంచి నేటి వరకు జరుగుతున్న పరిణామాలను గిరిజనులకు వివరించారు. నేటికీ పలు గిరిజన గూడల్లో కనీస వసతులు లేవన్నారు. వసతులు కల్పించనిపక్షంలో పోరాటం చేయక తప్పదన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఎస్.గంగయ్య, డి.దుర్గారావు, ఎస్.మజ్జియ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎరువు కరువు

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేని ఎరువులు
- ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్న రైతులు
- ఎరువులు కావాలంటే పురుగుమందు కొనాలని డీలర్ల డిమాండ్
- ఆందోళనలో అన్నదాత

సాలూరు రూరల్:

అన్నదాతను ఎరువుల కొరత వేధిస్తోంది. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచడంలో, సకాలంలో సరఫరా చేయడంలో వ్యవసాయశాఖ విఫలమైయింది. ప్రస్తుతం మండలంలోని ఏ ఒక్క రైతు సేవా కేంద్రంలో కూడా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. యూరియా, పొటాష్, డీఏపీ కావాలని అడిగితే రైతులకు అవసరం లేని కొన్ని రకాల పురుగుమందులను డీలర్లు అంటగడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో వాటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రాయితీపై ఎరువులు సరఫరా చేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని గుర్తు చేసుకుంటున్నారు.

శివరాంపురం సొసైటీలో అరకొరగా సరఫరా..

మండలంలోని నాలుగు సొసైటీలకు గాను ఒక్క శివరాంపురం సొసైటీలో మాత్రమే అరకొరగా ఎరువులు సరఫరా చేస్తున్నారు. సోమవారం ఈ సొసైటీలో ఎరువులు పంపిణీ ప్రారంభించగా.. ఉదయం 6 గంటల నుంచే పెద్ద సంఖ్యలో రైతులు క్యూ కట్టారు. అయితే యూరియా, డీఏపీ మాత్రమే సరఫరా చేశారు. అదికూడా ఒకరికి ఒక బస్తా చొప్పున మాత్రమే అందించారు. దీనిపై రైతులు ప్రశ్నించడంతో అందరికీ సర్దుబాటు చేయాల్సి ఉన్నందని అక్కడి సిబ్బంది తెలిపారు. అక్కడ నుంచి పొటాష్ కోసం సాలూరులోని డీలర్ల వద్దకు పరుగులు తీశారు. సొసైటీ ధర కంటే రూ.100లు అదనంగా తీసుకుంటున్నారని, అయినా సరిపడా డీఏపీ ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.


శివరాంపురం సొసైటీలో చాలీచాలని ఎరువులు


శివరాంపురం సొసైటీ వద్ద ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

పొటాష్ అందుబాటులో లేదు



శివరాంపురం సొసైటీలో పొటాష్ ఇవ్వడం లేదు. యూరియా, డీఏపీ ఇస్తున్నారు. అదికూడా అరకొరగా సరఫరా చేస్తున్నారు. ప్రత్తి, మొక్కజొన్నకు ప్రస్తుతం పొటాష్ అవసరం. అదును పోతు ఎరువు వేసుకున్న ఉపయోగం ఉండదు. వెంటనే పొటాష్ అందుబాటులో ఉంచాలి. సాలూరులో రూ.100లు అధిక ధరకు పొటాష్ కొనుగోలు చేస్తే డీలర్లు 20–20– లేదా పురుగుమందు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– ఉసుకూరి దాలయ్య, రైతు, శివరాంపురం


మూసి ఉన్న మామిడిపల్లి రైతుభరోసా కేంద్రం

20 రోజులుగా తెరుచుకోని మామిడిపల్లి ఆర్‌బీకే

మండలంలోని మామిడిపల్లి ఆర్‌బీకే గత 20 రోజులుగా తెరుచుకోలేదు. తొలివిడత ఎరువులు అంతంత మాత్రంగా పంపిణీ జరిగిందని గ్రామ రైతులు చెబుతున్నారు. ఆర్‌బీకే ఉద్యోగి సంధ్య సెలవుపై వెళ్లడంతో మూసివేసినట్లు గ్రామస్తులు చెపుతున్నారు. దీంతో మామిడిపల్లి రైతులు ఎరువుల కోసం ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు.

ఒక రైతుకి ఒక్క బస్తా మాత్రమే



ఎరువులు అరకొరగా పంపిణీ చేస్తున్నారు. ఒక రైతుకి ఒక్క బస్తా చొప్పున మాత్రమే ఇస్తున్నారు. సొసైటీ ద్వారా అందించిన ఎరువు సరిపోవడం లేదు. సాలూరు డీలర్ల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనికితోడు పురుగుమందు కొనుగోలు చేస్తేనే యూరియా, డీఏపీ, పొటాష్ ఇస్తామని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

– పెంట కృష్ణ, రైతు, శివరాంపురం

పూర్తిస్థాయిలో ఎరువులు అందడం లేదు

రైతులకు అవసరమైన ఎరువులు పూర్తిస్థాయిలో అందడం లేదు. శివరాంపురం సొసైటీకి రెండు సార్లు ఎరువులు వచ్చాయి. ఈ సొసైటీ పరిధిలో 16 గ్రామాల రైతులు ఉన్నారు. ఇంతమందికి సరిపడా ఎరువులు అందించాలని కోరుతున్నాం. అలాగే సాలూరు డీలర్ల వద్ద పొటాష్ కొనుగోలు చేస్తే నాశిరకమైన ఎరువులు అంటగడుతున్నారు.

– కనకల చిన్నంనాయుడు, రైతు

డీఏపీ కొరత


బలిజిపేటలోని ఓ ఎరువుల దుకాణంలో కనిపించని డీఏపీ

బలిజిపేట: ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలకు రెండో విడత ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ఆర్‌బీకేల్లో, మార్కెట్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డీఏపీ అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇతర ఎరువులను వినియోగించాల్సి వస్తోంది. డీఏపీ కోసం డీలర్లను అడిగితే ఏవేవో పురుగు మందులు కొంటేనే డీఏపీ ఇస్తామని అంటున్నారని రైతులు వాపోతున్నారు. గత ఏడాది మండలానికి 850 మెట్రిక్ టన్నుల డీఏపీ రాగా, ఈ ఏడాది 698 మెట్రిక్ టన్నులు వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. త్వరలోనే ఎరువులు వస్తాయని అంటున్నారు.

క్రాప్‌లోన్ రెన్యువల్‌కు ఇబ్బందులు


విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

మక్కువ: వ్యవసాయ రుణాలను రెన్యువల్ చేసేందుకు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలోని శాంతేశ్వరం గ్రామానికి చెందిన రైతులు యాండ్రాపు గోపాలకృష్ణ, కృష్ణ, మరిశర్ల సన్యాసినాయుడు, అప్పలనాయుడు, మరడాన శ్రీనివాసరావు సోమవారం విలేకరుల వద్ద తమ ఆవేదనను చెప్పుకున్నారు. మండలంలోని వివిధ బ్యాంకుల్లో క్రాప్‌లోన్ తీసుకున్నామని, ప్రస్తుతం లోన్ రెన్యువల్ చేసేందుకు వెళితే 1బీ తీసుకురమ్మని బ్యాంక్ అధికారులు పంపించేస్తున్నారన్నారు. గ్రామంలో భూములు సర్వే చేయడం వల్ల 1బీలు రావడం లేదని, రెవెన్యూ అధికారులను మాన్యువల్ 1బీలు అందించాలని కోరినప్పటికీ వారు స్పందించడం లేదని రైతులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీతంపేట: ఎపిడమిక్ సీజన్‌లో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని కడగండి గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఓంధ్రుజోలలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

తక్కువ ఖర్చుతో చీడపీడల నివారణ

పాచిపెంట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలస గ్రామంలో సోమవారం రైతులకు ప్రకృతిలో అందుబాటులో ఉండే పత్రాలతో కషాయాలను ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. దశపత్ర కషాయం, అగ్ని అస్త్రం ఎలా తయారు చేసుకోవాలి, ఎలా వినియోగించాలో ఎల్‌టు విజయ్‌కుమార్ రైతులకు వివరించారు. ఎకరానికి కేవలం 80 రుపాయిలలోపు ఖర్చుతో చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రసాయన ఎరువుల వినియోగించాలని సూచించారు. ఈ సేంద్రియ కషాయాలను తక్కువ ధరకే రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని, కావాల్సిన రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.


కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ తిరుపతిరావు

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

మక్కువ: మండల తహసీల్దార్ షేక్ ఇబ్రహీం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ఎన్నికల సమయంలో కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం పదోన్నతిపై మండలానికి తిరిగి వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్.. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సత్వరమే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.హేమలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ షేక్ ఇబ్రహీం

తల్లిపాలే బిడ్డకు అమృతం


బలిజిపేట: పలగరలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బలిజిపేట: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఇన్‌చార్జ్ సీడీపీఓ సులేఖ అన్నారు. మండలంలోని పలగర సచివాలయంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలలో ఉండే ప్రోటీన్లు శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. తల్లిపాలకు దూరమైన పిల్లల్లో ఎదుగుదల లోపించి బలహీనంగా కనిపిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ, కార్యదర్శి గౌరీశంకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాలూరు రూరల్: మండలం తోణాం పంచాయతీ పరిధి మెట్టవలస గ్రామంలో అంగనవాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలు ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టడం ద్వారా బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా పెరిగేందుకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో తోణాం పీహెచ్‌సీ ఎ.అవినాష్, ఏఎన్ఎం మణిక్యం, ఆశా వర్కర్ రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సాలూరు రూరల్: తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న తల్లులు

రైల్వే మార్గం ఎంతో అవసరం..

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రం పాలకొండ మీదుగా రైల్వేమార్గం వేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని పట్టణ పౌరహక్కుల వేదిక అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు అన్నారు. సోమవారం సహచర సభ్యులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంట్‌లో మాట్లాడుతూ విజయనగరం నుంచి రాజాం వయా పాలకొండ మీదుగా పలాస వరకు నూతన రైలుమార్గం ఆవశ్యకతను ప్రస్తావించడం హర్షణీయమన్నారు. రైలు మార్గం వల్ల ఈ ప్రాంత రవాణా వ్యవస్థ, ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రైల్వే మార్గం సాధన కోసం ఈ నెల పదో తేదీన సాయంత్రం ఆరు గంటలకు స్థానిక ఎలైట్ కళాశాల ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తామని.. అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.


మాట్లాడుతున్న పట్టణ పౌరహక్కుల వేదిక అధ్యక్షుడు చౌదరినాయుడు

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వారా ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో–2 బి.ఎరకయ్య వెల్లడించారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 14 ఏళ్ల వయసు నిండి, చదవడం, రాయడం వచ్చిన వారు పదో తరగతికి, 15 ఏళ్ల వయసు దాటి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌కి అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులేనన్నారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు తెలిపారు.

ఆర్థిక సాయం

పాలకొండ రూరల్: మండంలోని గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కోరాడ ఫణీంద్ర ఇటీవల తన స్వగృహంలో విద్యుత్ షాక్‌కు గురైన విషయం విధితమే. ఈ క్రమంలో ఆయనకు రెండు చేతులు తొలగించాల్సి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు రూ. 32 వేలు పోగుచేసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అల్లు బుల్లిబాబు, కడగల భాను, కె.వరహాలనాయుడు, కె.శ్రీనివాసరావు, కోట్ల వాసు, మురళి, శ్రీరామ్మూర్తి, తదితరులు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నా రు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8న ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు కమిటీ సభ్యు ల ఎన్నిక ఉంటుందన్నారు. ప్రతీ తరగతిలో విద్యా ర్థుల తల్లిదండ్రులను ముగ్గురు చొప్పున ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికైన 15మంది సభ్యు ల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కమిటీ సభ్యుల ఎన్నికలో ఎస్సీ, ఎస్టీ,బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో బడితోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బడితోటలో పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎన్.నాగభూషణరావు, స్థానిక హెచ్ఎం ఎస్ఎల్ఎన్ పాత్రుడు, పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేలా పీహెచ్‌సీల్లో అన్ని వసతులు సమకూర్చుతోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ ప్రాంగణంలో అదనపు భవనాల నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.38.94 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తిచేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ డీఈ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. పీహెచ్‌సీ ప్రాంగణంలో ల్యాబొరేటరీ, స్టోర్‌రూం, వెయిటింగ్ హాల్, కంప్యూటర్ రూం, కార్యాలయ భవనం, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యం, ఆర్.వేణుగోపాల్, పార్టీ మండల నాయకులు పి.నాగభూషణరావు, జక్కు పకీరునాయుడు, కె.బలరాం, వైద్యధికారి డాక్టర్ రాధాకాంత్, ఎంపీహెచ్ఈఓ జి.సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ జేఈ వి.రామ్మోహనరావు, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో అదనపు భవనాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం సమకూర్చిన నోట్‌బుక్స్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.సూర్యనారాయణ, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంఈఓ జి.సూరిదేముడు, ఎం.వి.రమణ, పెదబోగిలి సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, ఎస్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

బలిజిపేట: నిబంధనలకు అనుగుణంగా ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించాలని ఎంఈఓ–1 సామల సింహాచలం సూచించారు. మండలంలోని బలిజిపేట, పెదపెంకి–2 ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపించినట్లు చెప్పారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా హెచ్ఎంలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, విద్యార్థులను నైపుణ్యాలను, మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


పెదపెంకి–2 పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, పాఠశాల రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. అలాగే విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, చూసి రుచి, శుచికరమైన భోజనాలు విద్యార్థులకు పెట్టాలని తెలిపారు.

13న కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో వివిధ గ్రూపుల్లో పెంచిన సీట్లకు గాను ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 10 సీట్లు చొప్పున పెంచడం జరిగిందన్నారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నామని పేర్కొన్నారు.